# ★ ఆత్మహత్య

● శ్రీ పంగనామములు సూర్యప్రకాశరావు

మా అమ్మ చనిపోయిన నాలుగేండ్లకి నా ఆరవఏట మానాన్న చచ్చిపోయాడు. మాకున్న ఆస్థిని చూసిపెట్టడానికి నాకొకరక్షకుడు కావలసి వచ్చింది. అప్పటికి మాకూ వెంకటేశ్వరరావుగారికీ బంధుత్వం కన్న స్నేహం ఎక్కువగావుండేది. అంతేకాకుండా నాకు రక్షకుడుగా వుండదగిన బంధువులెవ్వరూ లేక పోయారు కూడాను. అందుచేత నాకాయనే రక్షకుడుగా ఉండవలసి వచ్చింది. ఆయనపోషణలో వుండినందుకు నేను విచారించలేదు. పైగా ఆనందించాను. కొన్నాళ్లు మురిసిపోయాను. నేడు దుఃఖిస్తున్నాను.

వెంకటేశ్వరరావుగారికి విశాల పెద్దమ్మాయి. ఆ అమ్మాయిని వెంకటేశ్వరరావుగారు, సీతమ్మ గారుకూడా పువ్వుల్లోపెట్టి పెంచారు.

విశాల నేను తరచుతోటలో ఆడుకునేవాళ్లం. అప్పుడు విశాల పెంకిపనులుచేసి నాకు కోపం తెప్పించేది. ఒకమాటు సీతమ్మగారు నన్నుకోప్పడింది. వెంటనే విశాలను పిలిచి అడిగాను. 'ఎందుకు అమ్మతో చెప్పావు?' 'మరినీవెందుకుకొట్టావు?' అనికోరగాచూసింది. 'నువ్వునేను కొయ్యవద్దన్న పువ్వును ఎందుకు కోశావు?' అన్నాను. అప్పుడు విశాల మృదువుగా నాచంపమీద చఱచి 'ఇంకెప్పుడూ అమ్మతో చెప్పనులే' అంది.

విశాల రానురాను పెద్దదౌతున్నది. ఆమె శరీరం పరిపూర్ణతను వహించసాగింది. బుద్ధి ప్రాజ్ఞతను పొందసాగింది. సీతమ్మగారికి మాత్రం మా ఆటలేమీనచ్చినట్లులేదు. ఒకనాడు నేను యింటికి వచ్చేటప్పటికి విశాల తన ప్రకృతివిరుద్ధంగా ఒక గదిలో కూర్చొని శూన్యంగా చూస్తున్నది. ఏదో జరిగిందనుకున్నా. ఆ పాము లాంటిజడను చేతులో కొట్టుకుంటూ అడిగాను, విశేషం యేమిటని. ఆతుమ్మెదల్లాంటి కండ్లను ఒక్కసారి చెకచెకా గదిచుట్టూ తిప్పింది. గిర్రున అటున్న మనిషి యిటు తిరిగి నాచెవుల్లోచెప్పింది. ఏమని? సీతమ్మగారు పాపం! తన్నుకోప్పడిందట నాతో స్వేచ్ఛగా వుంటున్నందుకు.

మరోనెలకు పెద్ద చదువుకోసం నేను యీవూరు వచ్చేశాను.

ఒకనాడు నాకు యింటినుంచి ఉత్తరం వచ్చింది; విశాలకు పెండ్లి అని. ఆశుభలేఖ నాకు గొడ్డలి పెట్టుగావచ్చింది.

కాని చిన్నతనములో ఆదుఃఖాన్ని రెండు రోజుల్లో మరచిపోయాను. మరోవారానికి పెండ్లికోసం యింటికి వెళ్లిపోయాను. చూడగానే సిగ్గు! ఇది శుభలేఖకన్న వజ్రాఘాతంగా వచ్చింది. శాంతంగా భరించడం కన్న చెయ్యగలిగింది యింకేమివుంది?

ఆ మర్నాడు పెళ్లి అనగా వెంకటేశ్వరావుగారు నాతో చెప్పారు. నాకుగూడా వారంరోజులలో పెండ్లిగాబోతున్నదనీ, పెండ్లికూతుర్లు ఒకరిద్దరు వున్నారని. అనేక పిచ్చిపిచ్చి ఊహాలుతట్టినయ్. నేను చదివిన నవలలలోని వీరులంతా నాకండ్లముందర నాట్యం చేశారు. కాని విశాలతో యీప్రస్తావన తెచ్చేందుకే భయంవేసింది.

కాని, మర్నాడు నన్ను చూడంగానే విశాల 'ఓహో! పెళ్లికొడుకూ!' అని హాస్యంచేసింది. నాహృదయంలోవున్న తీవ్రతరభావాల్ని తోసిపుచ్చి నేనుకూడా 'ఓహో! పెండ్లికూతురూ!' అనకతప్పిందికాదు. 'నీకో మంచి పెళ్లికూతుర్ని ఎంచాను, చేసుకుంటావా?' అంది. 'నీలావుంటుందా?' అన్నాను. 'అదుగో కొంటె మాట లాడ్తావు. మనకు వరుసలు కుదరవుట; లేకపోతే పెండ్లిచేసేవారే, అని జాలిగా చూసింది. నానవలలన్నీ మరచిపోయాను. విశాలను ఆశీర్వదించటానికి మాత్రం నా ఆ నవలలనన్నిటిని వుపయోగించుకోగలిగేను. విశాల కృతజ్ఞతా సూచకంగా 'ఆ కదంచేటివారి అమ్మాయి వరలక్ష్మి బాగుంటుంది. చాలా చదువుకుంది. బాగా పాడుతుంది.' అంది. 'సరే, చూద్దాం' అంటూ యివతలకు వచ్చేశాను.

నిజంగానే నాభార్య చాలాచదువుకుంది. బాగాపాడుతుంది. పైగా విశాల నాకోసం యెంచి యించ్చిందికదా అని నా భార్యమీద నాకుకలిగిన గౌరవం యిప్పటికీ పోలేదు. నేను నా భార్యని ఒకప్రేమ చిహ్నంగానే ప్రేమిస్తూ వచ్చాను.

మరొక రెండేళ్లకు బి. యల్. ప్యాసయి యీవూళ్లో బోర్డు తగిలించేటప్పటికి విశ్వనాథం విశాల భర్త, యీవూళ్లోనే వుంటున్నాడు. నేను మా వరలక్ష్మి తరచుగా వాళ్లింటికి పోతూవుండేవాళ్లం. అతనుకూడా మాతోబాటు సరదాగానే తిరిగేవాడు.

కొన్నాళ్లకు వరలక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది.

నేనొక్కణ్ణే విశ్వనాథాన్ని చూడ్డానికి వెళ్లేవాణ్ణి. సాధారణంగా విశ్వనాథం యింట్లోనే వుండేవాడు. ఎప్పుడైనా అతను లేకపోతే విశాలవచ్చి చిన్నతనపు ముచ్చటలు చెప్పి నన్ను మరపించేది. నేను వరలక్ష్మిని స్వీకరించినందుకు తనెంతో కృతజ్ఞురాల ననేది.

♦ ♦ ♦ ♦

విశాల ఎక్కడనుంచో తడుచుకుంటూ వస్తున్నది. నేను వెంటనే ఆమెను లోపలికి రమ్మన్నాను. ఆవర్షం రాత్రి పదిగంటలదాకా తెరిపియివ్వనేలేదు. వర్షంపడుతున్నంతసేపూ విశాల ఇంటికి పోవాలని తొందరపడుతూనేవుంది. చుట్టాల యింటికి సాయంత్రం వెళ్లిందట చూసొద్దామని. వంటైనాచేయలేదట. వాళ్లింట్లో భోజనాలు చాల ఆలస్యంగానే అవుతాయి. కాని ఇంతఆలస్యంగానా?

నాకు హోటల్‌నుంచి వచ్చిన క్యారియరు మాట చటుక్కున జ్ఞాపకంవచ్చింది. 'విశూ! ఇక్కడే అన్నం తినరాదూ? యీ అన్నం యిద్దరకు సులభంగా సరిపోతుందీ అన్నాను. చాలాసేపు తిననని వాదించింది. భర్త తినక మునుపు తను తినకూడదని! చివరకు నా బలవతంమీద తినటానికి ఒప్పుకుంది.

పదిగంటలకు వర్షం తగ్గగానే నేనొక జట్కా మాట్లాడాను, విశాలను అందులో ఎక్కించాను, నేనుకూడా అందులోనే కూర్చున్నాను. విశాలను 'దిగబెట్టేందుకు' విశ్వనాథం గారింటికి చేరుకున్నాం. అతను వీధివసారాలో అటూయిటూపచారీ చేస్తూన్నాడు. ముందునేను, తరవాత విశాల దిగివచ్చాం.

పాపం! విశాల వండడానికేమో వంటింట్లోకి వెళ్లింది. విశ్వనాథం వసారాలోంచి కేకవేశాడు హోటల్నుంచి తెప్పించుకున్నాలే, నాకోసం వండనక్కరలేదు అని. నేను విశ్వంతో అన్నాను బావా, విశాల మాయింటివరకూ వచ్చేటప్పటికి వర్షం పట్టుకుంది. అదృష్టవంతురాలు. మరి కాస్తదూరం వెళ్లాక పడితే తడిసి ముద్దయి వచ్చేది యింటికి. 'ఊఁ' అని గంభీరంగా అన్నాడు విశ్వం.

ఇంతలోకి వర్షం మళ్లీ విజృంభించింది. విశాల తలుపు చాటునుంచే అంది 'పోనీ, యీ రాత్రికి యిక్కడే పడుకోరాదు?' అని. నేను మూగగా ఒప్పుకున్నాను.

పదకొండు దాటివుంటుంది. నాకలత నిద్రలో మెలకువ వచ్చింది. విశ్వనాథం విశాలను ఏదో కోపంగానే తిట్టుతున్నాడు. నేను మేలుకున్నట్లు తెలియడం మంచిదికాదని పడుకున్నాను. విశ్వనాథం తనకసిఅంతా తీర్చుకొని ఎక్కడికో వెళ్లిపోయాడు.

విశాల వచ్చి నన్ను లేపింది. నాకు ఆమె అవస్థ అంతాచూస్తే జాలివేసింది. నేను ఆమె సంసారంలో యింత ఒడుదుడుకులున్నా యనుకోలేదు. పాలచెక్కిళ్లవెంట ముత్యాలలా కన్నీళ్లుకారుస్తూవున్న ఆశోక మూర్తిని ఎలా ఓదార్చడం? 'ఆయనకెందుకు కోపంవచ్చింది?' అని అడిగాను. విశాల చెప్పింది. 'వెంకటం! యిది యిన్నాళ్లూ దాచివుంచాను. యిది నువ్వు యీవూరు వచ్చినప్పటినుంచి జరుగుతూనేవుంది. నువ్వు ఇంద్రలోకతుల్యంగా వున్నాయి రోజులు అనే దినాల్లోకూడా నేను యీఅడకత్తెరలో నలుగుతూనేఉన్నాను. ఆయనకింత అసూయ ఎందుకు వచ్చిందో నా కర్థంకాలేదు. ఆయనను నొప్పిస్తానేమో ననేభయంచేతనే నేను ఆయనఎదుట సాధ్యమైనంతమటుకు నీతో మాట్లాడ్డం, నీకు కన్పించడం తగ్గించేదాన్ని. అయినా ఆయన అసూయ తగ్గలేదు. అది యివ్వాళ ఉగ్రతమ రూపందాల్చింది. నన్ను అనరానిమాటలు అన్నారు. యిందాక నీయింటిదగ్గర జట్కాలో ఎక్కుతున్నప్పుడే నేనీపర్యవసానం వూహించాను. వెంకటం, నేను నిన్ను మన సారా ప్రేమించాను. నా యీ సోదరప్రేమలో దురాశాబీజాలు లేవు. ఈ విషయం నీకూ నాకూ కాకుండా భగవంతునికికూడా తెలుసును. కాని, ఇక వచ్చేజన్మంలోనయినా నిన్నేపొందడంకోసం నేను నిత్యం దైవా రాధనచేస్తున్నా. నా హృదయపూర్వకంగా నీకు వరలక్ష్మినిచ్చాను. దాన్ని నాలాగే చూసుకో. ఇంక నీకు నమస్కారంమాత్రం యివ్వగలను. వర్షం తగ్గింది. నువ్వు యింటికివెళ్లు' అంది. సోదరి విశాల హృదయ గంభీర తను చూచి నేను మూగవాణ్ణయిపోయాను. ఏమనడానికి పాలుపోలేదు. అతిప్రయత్నంమీద 'నీవొక్కర్తెవీ ఎట్లా వుండగలవ్ చెల్లీ?' అన్నాను. 'నాకరున్నాడుగా ఫరవాలేదు, వెళ్లు, మఱచిపోకు, వెళ్లు' అంది.

నేను హృదయంలేని మొరడునై, మెదడులేని పశువునై బయటపడ్డాను. నాకు దేవుడు ఏమాత్రం మెదడు యిచ్చినా ఆమె మాటలలో అర్థం గ్రహించేవాణ్ణి. మూర్ఖుణ్ణి మాట్లాడకుండా వచ్చేశాను. వచ్చి కుంభకర్ణుడిలా నిద్రపోయాను.

తెల్లవారిలేచేటప్పటికి అప్పుడే పిడుగులాగవచ్చింది వార్త విశాల చచ్చిపోయిందని. నేను ఒక్క వూపున విశాల శవం ప్రక్కన పడ్డాను. ఏడ్చాను. ఏంలాభం? విశ్వనాథం ప్రక్క నిలబడి 'ఆత్మహత్య చేసుకుంది!' అన్నాడు నాకు రోషంవచ్చింది. 'ఆమె ఆత్మ నేటికి రెండేళ్లక్రిందటనే చచ్చిపోయింది; కాదు హత్యచేయబడింది. నేడు చచ్చిపోయినది ఆమె శరీరం మాత్రమే' అన్నాను.

## యోగి

### శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

చిమ్మచీకటిలాఁడు నిశీథమందు
ఎవరుపిలిచెదరిటు నన్ను?—
అంతకంతకు గంభీరమగుచు, నార్ద్ర
భావముల నొల్కఁబోసెడి పలుకుతోడ!

అమ్మరో! నీవు, నన్ను ఓదార్చకమ్మ
మధురమైన విషాద సమాధినుండి

మేలుకొలుపకు, నేను జన్మించినాను,
దుఃఖమునకె, శోకమె - నాదు తోడునీడ.

పాడుకొందును - అవిదితాంబగమునందు—
యెన్నడో నేను రచియించుకొన్న గీతి
అడ్డురాకుము - ఓదార్చకమ్మ నన్ను
సుకములెరుగని ప్రేమభిక్షుకుఁడ నేను.